# ప్రభుచిత్తం

## డా॥ అల్లంశెట్టి చంద్రశేఖరరావు

కథ

హెడ్ మాస్టరు మాటిమాటికీ ముఖం తుడుచుకొంటున్నాడు. అప్పుడే రెండుసార్లు నీళ్ళు తాగాడు. ఎంతమంది పిల్లలొస్తే అంతమందికే ఎటెండెన్సు ఇవ్వండి అని ఎంత చెప్పినా మాస్టర్లు తన మాట పట్టించుకోరు. ఐదుగురు, ఆరుగురికి ఎక్కువేస్తున్నారు: వీళ్ళు తనకొంప ముంచేటట్లున్నారు అని హెడ్‌మాస్టర్ భయపడిపోతున్నాడు. పూర్వం యమ్.ఇ.ఓ.లు విజిట్స్‌కి వచ్చేటప్పుడు ఎటెండెన్సుతో సహా అన్నిటినీ చూసేవారు. తప్పు చేస్తే మందలించే వారు. రిమార్కులు రాసేవారు. ఎక్సప్లనేషన్ అడిగే వారు. సాధారణంగా వార్నింగులతోనే విడిచిపెట్టేసే వారు. పనిష్‌మెంట్లు వుండేవికావు. ఈ మధ్యాహ్న భోజన పథకం వచ్చిన తరువాత యమ్.ఆర్.ఓ.లు, యమ్.డి.ఓలు, యమ్.పి.పి.లు, గ్రామ సర్పంచులు, రకరకాల సంఘాల వాళ్ళు అందరూ విజిట్ చేస్తున్నారు. అందరికీ సంజాయిషీలు చెప్పుకోవాలి. ఎటెండెన్సు ఎక్కువ చూపించమని భోజనకమిటీ అంటే ఎందుకు ఎక్కువ చూపిస్తున్నావని ఓడిపోయిన కమిటీ నిలదీస్తుంది. సరిగ్గా వేసినా తప్పే. ఎక్కువ ఎందుకు వెయ్యలేదంటారు. ఎక్కువ వేస్తే ఎందుకు వేశావంటారు. ఇందులో నీకెంత కమీషన్ అని తనని నిలదీస్తున్నారు.

మనకెందుకండీ ఈ రిస్కు ? ఏక్చువల్‌గా ఎంతమంది వస్తే అంతమందికే హాజరివ్వండి అని మాస్టర్లకు చాలాసార్లు చెప్పి చూశాడు. వారు వినిపించుకోరు. ఇద్దరు మాస్టర్లు మరీ మరీ ఎక్కువ వేస్తున్నారు. మిగతావారు ముగ్గురు నలుగురికి ఎక్కువగా ఎటెండెన్సు ఇస్తున్నారు. కొంచం గట్టిగా చెప్పి చూశాడు. వంట చేస్తున్న మహిళలు తనని తిట్టారు. సంఘం సభ్యులు కొందరు తనను బెదిరించారు. 'చూసీ చూడనట్లు ఊరుకోండి. క్లాస్‌టీచర్ ఇచ్చిన ప్రకారం బిల్లుపెట్టండి' అని చెప్పారు. తమ మాట వినకపోతే లేనిపోని పిటిషన్లు పెడతామన్నారు. ముందుకుపోతే గొయ్యి, వెనక్కుపోతే నుయ్యి. మొన్న జరిగిన సంఘటనతో తనకు కొంత జ్ఞానోదయం అయింది. ఎప్పటిలాగే బడికి వచ్చిన వాళ్లకి మాత్రమే ఎటెండెన్స్ ఇవ్వండి అని మాస్టర్లతో చెప్తున్నాడు. ఇంతలో వంటచేస్తున్న మహిళలు తనమీదకి దాడికి దిగారు. వాళ్ళల్లో ఆదిలక్ష్మి కొంచం చదువుకొన్నది. తెలివైనది. మంచి మాటకారి. గొప్ప చమత్కారి. ఆమె నెమ్మదిగానే ఒక్కొక్కమాట అంటించింది. "ఎడ్ మాస్టరు బాబూ ! నువ్వు చదువు కున్నోడివి. లెక్కలు తెలిసినోడివి. ఒక్కొక్క గుంటడికి రొండు రూపాయల్లెక్కని బిల్లు పెడతన్నావు. ఆ రొండు రూపాయల్లోనే పప్పు, ఉప్పు, సింతపండు, నూని, తాలింపుగింజలు కొనాలి. పొయ్యి కిందకి కర్రలు కొనాలి. వారానికోరోజు గుడ్డెయ్యాలి. పులుసులో పప్పుబద్దలు తక్కువైతే నువ్వూరుకోవు. అప్పుడప్పుడు అన్నంలో కూరో, నారో ఎయ్యాలంటావు. స్వీటులు గూడ ఇవ్వాలంటావు. ఇయన్నీ లెక్కపెకారం ఇస్తే మాకేటి మిగుల్తాది. కష్టం తప్ప. మాకు రోజు కూలి డబ్బులైనా రావొద్దా ? మావేటి తిని బతకాల. సెప్మీ. ఈపూట ఇరవైమంది గుంటలు రాకపోతే నలభై రూపాయలు తగ్గించి రాస్తావు. మా నలుగురిలో ఎవర్తిని ఇంటికి పొమ్మన గలం. దానికి కూలి దొరకొద్దా? బాబూ ! నీవొక్కడి గురించే సూస్తన్నావు గాని, పెపంచకం నీకు తెలీదు. బిల్లు పెట్టీడంతో నీ పనైపోద్ది. మా సేతికి డబ్బులిచ్చే దూటీ నీకు నేదు. ఈ డబ్బులుకోసం మాం ఎన్ని వఁరాకులు పడాలో నీకేటి తెలుసు. ఆ... నీకుమాత్తరం ఎందుకు తెలీదూ? నీ పయోడికి మూతికట్టందే నీకూ డబ్బులు రావని నీకుమాత్తరం తెలీదేటి. బాబూ ! మేం ఆడోళ్లం. ఆఫీసుల సుట్టూ తిరగనేం. ఆ సంగపోల్లు మాకు సేవ సేస్తన్నారు. ఆఫీసోల్లకి ఇంత ముట్టజెప్పి, ఆళ్లింత తిని, మాకింతిస్తన్నారు'' అంటూ అరచెయ్యి చూపించింది. హెడ్‌మాస్టరు ముఖం పక్కకు తిప్పుకున్నాడు. ఇక్కడితో ఆపిస్తే బాగుంటుంది అనుకొంటుండగా మళ్ళీ ప్రారంభించింది. "బాబూ! నువ్వే సెప్పు. ఈ దూతలందరికీ ఇవ్వవలసింది ఇచ్చీగా మాకేటి మిగుల్తాది. కూల్డబ్బులు కూడ కిట్టడం లేదు. అంతా కరకట్టుగా వుంటే మాం గూడ కరకట్టుగా వుంటాం. డబ్బులియ్యడం నీ సేతిలో నేదు. ఇక్కడ ఆజరు మాత్తరం కరకట్టుగా వుండాలంటావు. అంచేత ఎడ్‌మాస్టరు బాబూ ! నువ్వు సూసీ సూడనట్టు వూరుకో. నీకే పాపవు అంటదు". ఆదిలక్ష్మి మాటల్లో ఎంతో నిజం వుంది అనిపించింది. కాని తన పరిస్థితి – సస్పెన్షన్. భయం. ఇది తన చావుకే వచ్చింది. హెడ్‌మాస్టర్ కళ్ళల్లో నీళ్లు.

ఈవాళ మంత్రిగారు వస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకం ఫలితాలు సమీక్షిస్తారు. స్వయంగా పిల్లలకు వడ్డిస్తారు. వారితో పాటు కలక్టరుగారు వస్తారు. ఇతనితోనే చికాకు. చండశాసనుడు. ఎంత మంది భోజనం చేస్తున్నారో అంతమందికే బిల్లు చెయ్యండని ఆర్డరు పంపించావు. స్కూల్స్ విజిట్ చేస్తుంటాడు. ఎటెండెన్సు రిజిస్టరు పట్టుకొని క్లాసులోకి వెళ్తాడు. పేరుపేరునా ఎటెండెన్సు పిలుస్తాడు. తేడా వచ్చిందో సస్పెన్షన్. గూడెం హెడ్ మాస్టర్ని ఇలాగే సస్పెండు చేశాడు. పాపం అతను ఉత్తి అమాయకుడు. ఇరవై సంవత్సరాల సర్వీసులో ఒక పావుకేజీ బియ్యం కూడా ఇంటికి తీసుకువెళ్లలేదు. అంత ఆనస్టు.

ముందుగా యమ్.ఇ.ఓ వచ్చాడు. క్లాస్ టీచర్సుతో మాట్లాడుతున్నాడు. ఈరోజు పిల్లల సంఖ్య గూడా పెరిగింది. ఎప్పుడూ రానివాళ్ళు గూడా వచ్చారు. టీచర్లు పిల్లల పేర్లు అడిగి తెలుసు కుంటున్నారు. ఏ క్లాసులో ఎవరిని కూర్చోబెట్టాలో చూసుకుని ఆ విధంగా చేస్తున్నారు. ఎప్పుడూబడికి వెళ్ళని పొరుగూరులో పనిచేస్తున్న కాంతారావు

వచ్చాడు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డు తీసుకోవాలని ప్రయత్నం చేస్తున్నాడు. అతనిని అందరూ అయస్కాంతరావం టారు. అప్పుడే మాస్టర్లందరూ అతనిచుట్టూ చేరి బాతాఖానీ ప్రారంభించారు. ఈరోజుకి ఇన్‌స్ట్రక్షన్ ఇంతే అనుకొన్నాడు హెడ్‌మాస్టర్. మంత్రిగారు సరిగ్గా పన్నెండు గంటలకువస్తారు. మరొక గంటలో కలక్టరుగారు వస్తారు. క్లాసు టీచర్లు క్లాసుల్లోకి వెళ్ళిపోయారు. యమ్.ఇ.ఓ గారు, కాంతారావు సిగరెట్లు కాల్చుకొంటూ ఏవో ఏర్పాటులు చేస్తున్నారు. వెంకట్రావు రెండు స్ప్రైట్ సీసాలుతెచ్చి చెరొకటి అందించాడు. అతను ఆదిలక్ష్మి భర్త. మండల వంట వాళ్ళ సంఘానికి కార్యదర్శి. అందరూ అధ్యక్షుడు అంటారు. వంటవాళ్ళ సమస్యలను పరిష్కరించడమే ఇతని ఏకైక కర్తవ్యం. ఆ పని తప్పించి మరేపని చెయ్యడు. ఆదిలక్ష్మి చెప్పిందే నిజం ఐతే ఈ వంట పనికి ఇంత పోటీ ఎందుకు. ఏ పనీ చెయ్యకుండా వెంకట్రావు విలాసంగా ఎలాగ జీవించగలుగు తున్నాడు. హెడ్‌మాస్టర్ ఆలోచనలో పడ్డాడు.

అందరూ అనుకొన్నట్టుగానే కలక్టరుగారు వచ్చారు. వారితోపాటు యమ్.ఆర్.ఓ., రెవిన్యూ సిబ్బంది వున్నారు. హెడ్‌మాస్టర్ కలక్టర్‌గారికి నమస్కరిస్తూ స్వాగతం చెప్పాడు. కలక్టర్‌గారు హెడ్‌మాస్టర్ గారి కుర్చీలో కూర్చొన్నారు. హెడ్ మాస్టర్ చేతులు.కట్టుకొని వినయంగా నిలుచున్నాడు.

"ఈరోజు ఎటెండెన్సు ఎంత?"

హెడ్‌మాస్టర్ చెప్పాడు.

ఎదురుగా బోర్డుమీదున్న హాజరు వివరాలు చూశారు.

"నా ప్రశ్నలకి ముందుగానే ప్రిపేరయి వున్నావన్నమాట. స్కూలు స్ట్రెంగ్తు ఎంత? ఎన్ని క్లాసులు? నంబరాఫ్ రోల్స్ ఎంత?"

హెడ్‌మాస్టర్ అన్నిటికీ సమాధానం చెప్తు న్నాడే గాని గొంతులోని ఒణుకును అదుపులోకి తెచ్చుకోలేకపోతున్నాడు.

"ఎటెండెన్సు రిజిస్టరులు తెప్పించు"

ప్రక్కనే టేబుల్‌మీదున్న రిజిస్టరులు కలక్టరు గారు ముందుంచాడు హెడ్‌మాస్టర్.

రిజిస్టరులు చూస్తూ ఎదురుగా వున్న బోర్డు చూస్తున్నారు.

"మధ్యాహ్న భోజనం పథకం ప్రారంభించిన తరువాత ఎటెండెన్సు బాగా పెరిగిందే"

ఔనన్నట్లు హెడ్‌మాస్టరు తలాడించాడు.

"అలా నీళ్ళు నములుతావేం? గట్టిగా చెప్పు"

"ఔనండి హాజరు బాగా పెరిగింది. ఎన్‌రోల్ మెంటు గూడా బాగాపెరిగింది."

"ఇంకా పెంచాలయ్యా. చూడు బోర్డుమీద నంబరాఫ్ రోల్స్ సుద్దముక్కతో కాకుండా తెల్లపైంట్‌తో రాస్తే బాగుంటుంది కదా? అలా చెయ్."

"ప్రతినెలా ఎన్‌రోల్‌మెంట్ పెరుగుతుంది సార్. అందుచేత వార్నిష్‌తో రాయించలేదు."

హెడ్‌మాస్టరు వినయంగానే చెప్పినా కలక్టరుగారికి కోపం వచ్చింది.

"వైట్ పైంట్‌తో పాటు బ్లాక్‌పైంట్, ఒక బ్రష్ కూడా దగ్గర వుంచుకో. పద క్లాసులు చూద్దాం."

హెడ్‌మాస్టరు ఎటెండెన్సు రిజిస్టరులు పట్టుకొని బయలుదేరాడు. ప్రక్క తరగతిలో ప్రవేశించారు. ఐదవతరగతి క్లాస్ టీచర్‌రామారావు నమస్కారం చేశాడు.

"ఎటెండెన్సు పిలు" అన్నారు. రామారావు తన క్లాసు రిజిస్టరు తీసుకొని ఎటెండెన్సు పిలుస్తున్నాడు.

"నువ్వు కాదు. మీరు పిలవండి" అన్నారు హెడ్‌మాస్టరుతో. హెడ్‌మాస్టరు ఎటెండెన్సు పిలిచాడు.

"ముప్పైఐదు బై నలభైరెండు"

"తలలు లెక్కించండి"

యమ్.ఇ.ఓగారు లెక్కపెట్టారు.

"సరిపోయాయి సార్"

"గుడ్. బాగుందయ్యా. పక్కక్లాసుకు వెళ్దాం"

హెడ్‌మాస్టరు తీసుకువెళ్ళాడు.

"ఇది ఏ క్లాసు?"

"నాలుగవ తరగతి."

"ఆ ప్రక్కది?"

"మూడవ తరగతి"

"ముందు మూడవ తరగతే చూద్దాం"

అక్కడగూడ ఎటెండెన్సు తీసుకున్నారు. కరక్టుగా వుంది. హెడ్‌మాస్టర్ ఆశ్చర్యపోయాడు. హమ్మయ్య! మాస్టరు ఎటెండెన్సు ఎక్కువ వెయ్యకుండా సరిగ్గా వేసి సస్పెండవకుండా తన్ను కాపాడాడు.

'అదిగోండి. ఆ రెండు గదుల్లో ఒకటి రెండు తరగతులు ఉన్నాయి."

"అటు వెళ్దాం!"

కలక్టరు గారు రెండడుగులు వేసి హెడ్ మాస్టర్ ముఖం చూశారు. చిన్నగా నవ్వుతూ "నాలు గవ తరగతి చూడలేదు కదా !" అన్నారు.

"ఔనండి"

'ఆ క్లాసు చూద్దాం పదండి'.

నాలుగవ తరగతి ఐదవ తరగతి పక్కనే వుంది.

క్లాస్ టీచరుకు ఎటెండెన్సు రిజిస్టరు ఇచ్చి హాజరు తీసుకోమన్నారు. టీచరు ఒక్కొక్క పేరు పిలుస్తున్నారు. ఈ మాస్టరు పిల్లలు రాకపోయినా ఎటెండెన్సు ఇచ్చేవాళ్ళలో ప్రథముడు. హెడ్‌మాస్టరుకు భయంగా వుంది. గాభరా పడ్డాడు. తనకి సస్పెన్షన్ ఖాయం అనుకొన్నాడు. ఐదవ తరగతి పిల్లలే కొందరు ఇక్కడ కనిపిస్తున్నారు. అవే ముఖాలు, కాని షర్టులు మారిపోయాయి. ఇక్కడ వారిపేర్లు గూడ మారి పోయాయి. హెడ్‌మాస్టరుకు వణుకు పుట్టింది.

కలక్టరు గారు క్లాస్ టీచరును మెచ్చు కొన్నారు. అతను హెడ్‌మాస్టరువైపు నవ్వుతూ చూశాడు.

ఒకటి రెండు తరగతులలో గూడ ఇటు వంటి ఏర్పాట్లే చేశారు గాని కలక్టరుగారు అటువైపు వెళ్లలేదు.

"బాగుందయ్యా. కీపిటప్". కలక్టరుగారు హెడ్‌మాస్టర్ని అభినందించారు. హెడ్‌మాస్టర్ని సన్మానించాలనుకొన్నారు. ఇటువంటి ఉత్తమ ఉపాధ్యాయులను ప్రోత్సహించడం తన విధి అను కొన్నారు. ఈ విషయం చెప్పాలనే యమ్.ఇ.ఓ గారిని దగ్గరకు పిలిచారు. అతనితో పాటు కాంతారావు గూడ వస్తూ "సార్ ! అన్ని ఏర్పాట్లూ పూర్తయాయి. వంటలు గూడ పూర్తయిపోయాయి" అంటూ కలక్టరుగారి చెంత చేరాడు. ఉపాధ్యాయులు మొఖ మొఖాలు చూసుకొన్నారు. "ఉత్తమ ఉపాధ్యాయుల లిస్టులోకి ఎక్కిస్తారో" ఒక నోటి దురుసు మాస్టరు మెల్లగా సణిగాడు. హెడ్‌మాస్టరు మొఖంలో నిరాశ.

అనుకొన్న సమయానికే మంత్రిగారు వచ్చారు. మంత్రిగారితో పాటు ఎమ్.ఎల్.ఎ.., ఎమ్.పి.పి గారు కూడ వచ్చారు. "నమస్తే సార్ !" అంటూ కాంతారావు ఎమ్.పి.పి పక్కన చేరి పోయాడు. "ఇతను కాంతారావని మంచి సోషల్ వర్కర్. ఈ వూళ్లో మన పార్టీకి పెద్ద దన్ను" అంటూ ఎమ్.ఎల్.ఎ గారికి పరిచయం చేశాడు ఎమ్.పి.పి. "ఔనౌను. అతను అధికారంలో వున్న ఏ పార్టీకైనా పెద్ద దన్నే" లౌక్యం తెలిని ఒక ఉపాధ్యాయుడు మనస్సులోమాట మెల్లగా బయటకు అనేశాడు. "ఆ విషయం ఎమ్.పి.పి.గారికి తెలియక కాదు. ఐనా అలా చెప్పటం రాజకీయం" ఇంకొక ఉపాధ్యాయుని వివరణ.

మంత్రిగారు పదిమందిపిల్లలకి స్వయంగా సాంబారు వడ్డించారు. పిల్లలకు గుడ్డుతోపాటు సాంబారులో పప్పుగూడ లభించింది. స్పెషల్‌గా లడ్డూలు పంచారు. మంత్రిగారు హెడ్‌మాస్టరు కృషిని ప్రశంసించారు. మధ్యాహ్న భోజన పథకం వల్ల బడికి వచ్చే పిల్లల సంఖ్య పెరిగిందన్నారు. ఈ పథకాన్ని హైస్కూళ్ళకు గూడ విస్తరిస్తామన్నారు. పత్రికా విలేకరులు చకచకా రాసుకొంటున్నారు. హెడ్‌మాస్టరు జనంలో కలిసిపోయి ఒక చివరన నిలుచున్నాడు. కాంతారావు మాత్రం అంతా తానే అయినట్లు హడావుడిగా తిరుగుతున్నాడు.